క్లుప్తంగా

మహిళ సంఘం భవన పెండింగ్ పనులు ప్రారంభం



పెర్కిట్(ఆర్మూర్): సుర్బిర్యాల్ గ్రామంలో మహిళ సంఘ భవన పెండింగ్ పనులను బీఆర్ఎస్ నాయకుడు సట్లపల్లి గణేశ్ ఆదివారం ప్రారంభించారు. మిగిలిపోయిన పనులు పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే జీవన్ రెడ్డి రూ.5 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ జ్యోతి, ఎం రోహిత, నవనీత, సత్య గంగు, లక్ష్మీ, సవిత, మానస, లాస్య, జయ, పద్మ, సుశ్మిత, కవిత పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు



వేల్పూర్: మండల కేంద్రమైన వేల్పూర్ చర్చి సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరైనట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. నిధుల మంజూరు ఉత్తర్వులను ఆదివారం చర్చి ఫాస్టర్ స్తోత్రరాణికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు రేగుల్లరాములు, వేల్పూర్ సర్పంచ్ తీగెల రాధామోహన్, ఉప సర్పంచ్ పిట్ల సత్యం, నాయకులు బబ్బూరు ప్రతాప్‌రెడ్డి, మొండి అశోక్, సుంకరి రాము, స్వామిదాస్, పురుషోత్తం, జక్కయ్య, దీవెనమ్మ, విక్టోరమ్మ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన శిబిరానికి తరలిరావాలి



నవీపేట: అభ్యుదయ గ్రామీణ వికాస సంఘం, ఆర్య సమాజం ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించనున్న ఏక దివషీయ దేశభక్తి సహిత ఆధ్యాత్మిక చింతన శిబిరం నిర్వహణకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం నవీపేటలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల ప్రతినిధులు గంజి సాయన్న, నాంపల్లి వసంత్, నరేంద్రశేఖర్, రాజారెడ్డి, సంజీవ్‌రెడ్డి, ధీరేంద్ర మహారాజ్, ఆర్య సమాజ్ ప్రతినిధులు విజయ్, తిరుమల శ్రీనివాస్, పద్మ పాల్గొన్నారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



ఎస్సై యాదగిరి గౌడ్

నవీపేట: నవీపేట ఎస్సైగా యాదగిరిగౌడ్ ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని ప్రజలకు సూచించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్సై రాజారెడ్డి పదోన్నతిపై జగిత్యాలకు వెళ్లారు.

బీఆర్ఎస్‌లో చేరిక



రుద్రూర్: బీజేపీ దళిత మోర్చా మండల అధ్యక్షుడు అశోక్ కాంబ్లెతో పాటు మరో పది మంది బహుజన స్త్రీ శక్తి మహిళ సంఘ సభ్యులు ఆదివారం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు వారు వెల్లడించారు.

కాలయాపన తగదు



నవీపేట: పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్చల పేరుతో కాలయాప తగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాయక్‌వాడీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉద్యోగభద్రత కల్పించాలనే తదితర డిమాండ్లలో కార్మికులు 18 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం శోచనీయం అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, పోశెట్టి, మీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్: సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించక పోవడంతో పంచాయతీకార్మికులు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో శానం శ్రీకాంత్, కృష్ణ, సంతోష్, రాజు, సాయిలు, శ్రీనివాస్, వహీద్, మహిమూద్, సాయవ్వ, అనిత పాల్గొన్నారు.



రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?

- ప్రయాణం ప్రాణసంకటం
- వర్షాలకు అధ్వానంగా మారిన రోడ్లు



బోర్గాంలో రోడ్డు దుస్థితి



సాటాపూర్‌లో బురదమయమైన రోడ్డు

రెంజల్: వర్షానికి రోడ్లన్నీ బురదమయంగా మారాయి. రోడ్లు వెంబడి పోవాలంటే సర్కస్ ఫీట్లు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులు సరిగా లేకపోవడంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు వెనుకడుగు వేస్తున్నారు. గ్రామాల్లో రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చినుకు పడితే చాలు గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు బురదగా మారుతున్నాయి. రోడ్లు వేయించాల్సిన పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రహదారులు నిర్మించాలని స్థానికులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు ఇలా ఉంటే ప్రయాణం ఎలా సాధ్యమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఇదే పరిస్థితి నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేస్తున్నా అభివృద్ధి ఎక్కడ వేసి గొంగలి అక్కడే అన్న చందంగా తయారైంది. పాలకులు, అధికారులు స్పందించి రోడ్లు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పనుల్లో కొరవడిన నాణ్యత

మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ నుంచి అమ్రాద్ వరకు 4 కిమీ మేర బీటీ రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ. 5 కోట్లు మంజూరు చేసింది. పనులు నెల కిందట ప్రారంభించి తొలుత రహదారిపై శిథిలావస్థలో ఉన్న కల్వర్టులను తొలగించి వాటి స్థానంలో కొత్తగా మూడు కల్వర్టులు నిర్మించారు. నాసిరకంగా పనులు చేపట్టడంతో ఒక కల్వర్టు కూలిపోయింది. మరో కల్వర్టుపై పెద్ద రంధ్రం ఏర్పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పనులు నాసిరకంగా చేపడుతున్నా ఆర్అండ్‌బీ ఇంజనీర్లు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మాణిక్‌భండార్ శివారులో నిర్మించిన వారం రోజులకే కూలిన కల్వర్టు

కల్వర్టులు పటిష్టంగా ఉండాలి



రోడ్డు పనుల్లో నాణ్యత లోపించింది. కల్వర్టుల నిర్మాణం పటిష్టంగా ఉండాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మిగిలిన కల్వర్టు నిర్మాణ పనుల్లోనైనా నాణ్యత పాటించి పటిష్టంగా చేపట్టాలి.

–డి గంగాధర్, ఏఐకేఎంఎస్, జిల్లా ప్రధాన కార్యదర్శి

లేఫ్ హౌజ్‌లో మొక్కలు సిద్ధం

- పోచంపాడ్‌లో ప్రయోగాత్మకంగా అమలు



పోచంపాడ్ నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ ఫారెస్ట్ నర్సరీలో జిల్లాలో ప్రయోగాత్మకంగా లేథ్ హైజ్‌లో మొక్కల పెంపకం విజయవంతంగా పెరిగాయి. లేథ్ హౌజ్‌లో 70 వేల మొక్కలను మొదటి సారి పెంచి, ఇతర బ్యాగుల్లోకి మార్చేందుకు సిద్ధంగా ఉంచారు. లేథ్ హౌజ్ నిర్మాణ పనులను జవి నెలలో ప్రారంభించారు. గత ఫిబ్రవరి మాసం నుంచి మొక్కలు పెంపకం ప్రారంభించారు. లేథ్ హౌజ్ నిర్మాణం 70 వేల మొక్కల పెంపకం సామర్థ్యంతో నిర్మించారు. నర్సరలో నాణ్యమైన మొక్కలను పెంచాలని ప్రభుత్వం జిల్లాలో పోచంపాడ్‌లోనే ఏకైక లేథ్ హౌజ్ ను మంజూరు చేసింది.లేథ్ హౌజ్ నిర్మాణానికి రూ. 7 లక్షల మంజూరు చేశారు. లేథ్ హజ్‌లో రూట్ ట్రేలలో నారు పెంచి అక్కడి నుంచి ప్లాస్టిక్ బ్యాగుల్లోకి మార్చుటకు సిద్ధంగా ఉంది. ట్రేసర్‌లలో మొక్కకు సరైన పోషకాలను నారు దశ నుంచే అందించి, నాణ్యమైన మొక్కలన పెంచారు నర్సరీల్లో ప్లాస్టిక్ బస్తాల్లో మట్టిని నింపి అందులోనే విత్తనాలను విత్తుతారు దీంతో కొన్ని సందర్భాల్లో మొక్కలు సరిగా మొలకెత్తడం లేదు. సకాలంలో మొలకెత్తక పోవడం, నాణ్యమైన మొక్కగా ఎదగక పోవడం లాంటి సమస్యలు తలెత్తకుండ లేథ్ హైజ్‌లో మొక్కల పెంపకం చేపట్టలాని ఉద్దేశ్యంతోనే లేథ్ హౌజ్ నిర్మించారు. మారేడు, అల్లనేరడి, టేకు, మద్ది మొక్కలు పెంచుతున్నారు. ఇందులో పెంచిన మొక్కలు నాణ్యతగా ఉంటాయని తెలిపారు. త్వరలోనే ఆ మొక్కలను ఇతర ప్లాస్టిక్ బస్తాల్లోకి మార్చి మొక్కగా పెంచుతామన్నారు. తరువాత మొక్కలు నాటులకు పంపిణీ చేస్తామని మెండోరా మండల ఫారెస్ట్ సెక్షన్ అధికారి గణేష్ తెలిపారు. నర్సరీల్లో ఈ ఏడాది రెండు లక్షల మొక్కలను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బోధన్ రూరల్: బోధన్ నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే షకీల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గిర్ధావర్ గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయిలు పేర్కొన్నారు. వివిధ అభివృద్ధి పనుల కోసం సీఎం కేసీఆర్‌ను కలిసి రూ. 10 కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే షకీల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కమ్యూనిటీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు కావడం హర్షణీయం అని వారు పేర్కొన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి



మాట్లాడుతున్న ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా నిచిపోయిన అభివృద్ధి పనుల వద్ద బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఫొటోలు దిగి ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్ కూడా దక్కదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, నాయకులు పండిత్ పవన్, ఖాందేష్ శ్రీనివాస్, కౌన్సిలర్లు ఆకులరాము, డార్లింగ్ రమేష్, రవిగౌడ్, కాశీరాం, ఎస్‌రమేష్, పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం



కార్యకర్తకు బహుమతి అందజేస్తున్న అంబర్ సింగ్

వర్ని: వచ్చే ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం ఖాయం అని జెడ్పీ ఫ్లోర్ లీడర్ అంబర్ సింగ్ వెల్లడించారు. కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో ప్రధానపాత్ర పోషిస్తున్న నలుగురికి రూ. 5 చొప్పున నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో చందూరు వైస్ ఎంపీపీ దశ గౌడ్, వర్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్ బాబా, చందూర్ అధ్యక్షుడు పోతరాజు శ్రీనివాస్, నాయకులు మారుతి, హనుమంతరావు, గుణ్ణం సురేష్, గజ్జల సాయిలు, చిన్నారెడ్డి, పీరియ తదితరులు పాల్గొన్నారు.

హింసకు ప్రధాని బాధ్యత వహించాలి



కోటగిరిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

రుద్రూర్: మణిపూర్ రాష్ట్రంలో చెలరేగిన హింసకు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బాధ్యత వహించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఇద్దరి మహిళలను నగ్నంగా ఊరేగించినందుకు నిరసనగా కోటగిరిలో సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆనంతరం సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ మాట్లాడుతూ సంఘటనపై మేధావులు స్పందించి దోషులను కఠినంగా శిక్షించే వరకు ఉద్యమాలు చేపట్టాలని కోరారు. నాయకులు నల్ల గంగాధర్, నీలి దత్తు, ఎడ్డెడి దత్తు, రమణమ్మ, పుష్ప, సత్యవతి, ఉష, వాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కోసం 26వ రోజూ దీక్ష



దీక్షలో పాల్గొన్న రైతులు

రెంజల్: రెంజల్ గ్రామం నుంచి ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి వరకు గల బండల్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానిక గాంధీ విగ్రహం ముందు గ్రామ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రిలే దీక్షలు ఆదివారం నాటికి 26వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం రోడ్లు నిర్మించే వరకు ఆందోళన విరమించేదిలేదని రైతులు పేర్కొన్నారు. 8 ఏళ్లగా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కటికెల శ్రీనివాస్, లోలపు ఒడ్డెన్న, కొండల్‌వాడీ శ్రీనివాస్, దేశ్‌పేట్ పోశెట్టి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



రుద్రూర్: మండల కేంద్రంలోని జవహర్ నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం పార్టీ ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికులతో కలిసి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలలో మరుగుదొడ్లు లేకపోవడం శోచనీయం అన్నారు. ప్రహరీ లేకపోవడంతో రాత్రి సమయాల్లో మందుబాబులకు పాఠశాల ఆవరణం అడ్డాగా మారిందని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భీమయ్య తదితరులు ఉన్నారు.

హన్మంతు సేవలు మరువలేనివి



ఆర్మూర్‌టౌన్: జిల్లాలో ఎంతో మంది హాకీ క్రీడాకారులను తయారు చేసిన ఘనత రిటైర్డ్ పీడీ హన్మంతుకు దక్కుతుందని హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి అన్నారు. ఆర్మూర్‌లో ఆదివారం హన్మంతు సంతాప సభ నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ క్రీడల అసోసియేషన్ సభ్యులు విద్యాసాగర్‌రెడ్డి, సదమస్తు రమణ, మల్లేష్‌గౌడ్, కౌన్సిలర్ గంగామోహన్ చక్రు, ఉమా మహేశ్వర్‌రెడ్డి, శ్యామ్, రవీందర్, హనుమాన్ యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో భారీ వర్షం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ ఉన్నప్పటికీ ఒక్కసారి వాతావరణంలో మార్పు వచ్చి రెండు గంటల పాటు భారీ వర్షం పడింది. రోడ్లపై వర్షపునీరు పెద్ద ఎత్తున వచ్చి చేరింది.

మైనారిటీలకు రూ. లక్ష రుణం

బోధన్‌టౌన్: మైనారిటీలను ఆర్థికంగా ఆదుకునేందుకు బ్యాంకు లింకేజీతో సంబంధం లేకుండా సీఎం కేసీఆర్ రూ.లక్ష రుణం అందించడం అభినందనీయం అని ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ తెలిపారు. నియోజకవర్గంలో వెయ్యి యూనిట్లు మంజూరు చేశారన్నారు. పలు అభివృద్ధి పనులకూ నిధులు మంజూరు చేసేందుకు సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. బోధన్, సాలూర, ఎడపల్లి, రెంజల్, నవీపేట్ మండలాల్లో సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలకు రూ. 50 కోట్లు, బోధన్ బల్దియాలో అభివృద్ధి పనులకు రూ. 25 కోట్లు, తండాల్లో రోడ్లు, కమ్యూనిటీ భవనాల కోసం రూ. 11 కోట్లు, ఈద్గా, చర్చి నిర్మాణాలను రూ. 10 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలో రెండు వరుసల రోడ్లు నిర్మాణానికి రూ.66.30 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు.

అనాథ ఆశ్రమంలో పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న పోచారం భాస్కర్‌రెడ్డి

వర్ని: డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం మోస్రా మండలం చింతకుంటలోని అనాథ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వేడుకలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోస్రా జెడ్పీటీసీ విజయభాస్కర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పిట్ల శ్రీరాములు, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు హనుమంతరెడ్డి, చందూర్ సహకార సంఘం అధ్యక్షుడు ప్యారం అశోక్, సర్పంచులు విమల సాయన్న, సాయిరెడ్డి ,సత్యనారాయణ, నరేందర్ రెడ్డి, నాయకులు సాయి గౌడ్, రామ్ రెడ్డి, వర్ని మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వెలగపూడి గోపాల్, మండల కో ఆప్షన్ సభ్యుడు కరీం పాల్గొన్నారు.



రుద్రూర్‌లో..

నూతనకార్యవర్గ ఎన్నిక ..

విశ్వబ్రాహ్మణ సంఘ కార్యవర్గం ఎన్నిక



బాల్కొండ: ముప్కాల్ మండల విశ్వబ్రాహ్మణ సంఘ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేందర్, కోశాధికారి గంగాధర్, సలహాదారులుగా రాజేశ్వర్, ఆనందం, నవీన్, గంగా మహేశ్ ఎన్నికయ్యారు.

గ్రామాభివృద్ధి కమిటీ..



రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లి గ్రామాభివృద్ధి కమిటీని ఆదివారం సర్పంచ్ పుష్పలత అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుర్మ రాజు, ఉపాధ్యక్షులుగా నక్క కిరణ్, ప్రధాన కార్యదర్శిగా బేగరి గోపి, సహాయ కార్యదర్శిగా సుదర్శన్ గౌడ్, కోశాధికారి తగిలేపల్లి అశోక్, సహాయ కోశాధికారిగా కృష్ణార్జున్, సలహదారులుగా డాక్టర్ మల్లేష్, కర్రోళ్ల రాజయ్యను ఎన్నుకున్నారు. మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా తీజ్ పండుగ



బోధన్‌రూరల్: బోధన్ మండలంలోని ఊటపల్లి గ్రామంలో తీజ్ పండుగను ఆదివారం గిరిజనులు ఘనంగా నిర్వహించారు. గిరిజన యువతులు నవధాన్యాల మొలకలతో కూడిన బుట్టలను ఎత్తుకొని ర్యాలీగా వెళ్లి అనంతరం నియజ్జనం చేశారు.

ఉత్సవాలకు వెళ్లిన పిరమిడ్ మాస్టర్లు



ఆర్మూర్‌టౌన్: పత్రీజీ ఆరాధన ఉత్సవాల సందర్భంగా రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి పిరమిడ్ మాస్టర్లు తరలివెళ్లారు. సోమవారం నుంచి ఆరాధన ఉత్సవాలకు జిల్లా నుంచి 200 మంది దాకా పిరమిడ్ మాస్టర్లు వెళ్లినట్లు నవనాథపురం కమిటీ సభ్యుడు సాయికృష్ణ రెడ్డి తెలిపారు. తిరుమల గంగారాం, శేఖర్‌రెడ్డి, చిదుర రాజు, నాగభూషణం, సాయిబాబా, నారాయణ, సతీష్, పిరమిడ్ మాస్టర్లు ఉన్నారు.

సంక్షిప్తం

హోంగార్డు మృతి

మాక్లూర్: హోంగార్డు గంగారాం (55) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని అమ్రాద్‌తండాకు చెందిన గంగారాం చాలా కాలంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు. అనంతరం బదిలీపై నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ విద్యుత్ జెన్‌కోలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు.

కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగ లేకపోవటంతో దహన సంస్కారాల కోసం ఆర్మూర్ ఎస్సై సురేష్ బాబు రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందించారు.

ఆలయంలో సమస్యకు పరిష్కారమేదీ?

రుద్రూర్: మండల కేంద్రమైన రుద్రూర్ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో నెలకొన్న మురికి కాల్వ సమస్యకు పరిష్కారం చూపాలని భక్తులు కోరుతున్నారు. ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నందున వర్షం వస్తే ఆలయ ప్రాంగణం మురికి నీటితో నిండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రెయినేజీ నిర్మాణానికి జెడ్పీటీసీ సరోజి గంగారాం రూ. 2 లక్షలు మంజూరు చేయించారు. పనులు ప్రారంభించగా కొందరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో నిలిపివేశారు.

పదోన్నతి పొందిన సీఐకి సన్మానం

మాక్లూర్: సీఐగా పదోన్నతి పొందిన సాయికుమార్‌గౌడ్‌ను ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో గ్రామస్తులు సన్మానించారు. నిజామాబాద్ 6వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తించిన సాయికుమార్‌గౌడ్ ఇటీవల పదోన్నతి పొందిన విషయం తెలిసిందే.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన ఎంపీ

రుద్రూర్: రాణంపల్లి మాజీ సర్పంచ్ మహ్మద్‌ను ఆసుపత్రిలో ఆదివారం జహీరాబాద్ ఎంపీ బీబీ పటేల్ పరామర్శించారు. ఆయన చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్న ఎంపీ ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు.

జర్నలిస్టుల కాలనీలో శ్రమదానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. కాలనీలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించి మురికి కాల్వలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గొనికొండ అశోక్, ప్రధాన కార్యదర్శి కమలాకర్, ఉపాధ్యక్షుడు కొక్కెర భూమన్న, సుంకే శ్రీనివాస్, కొంతం రాజు తదితరులు పాల్గొన్నారు.

వరద నీటిలో చేపల వేట



రుద్రూర్: చెరువులు నిండి అలుగు పారడంతో చేపలు ప్రవహంలో చేపలు కొట్టుకొస్తున్నాయి. చేపలు పట్టుకొవడానికి యువకులు , పిల్లలు అలుగు వద్దకు చేరి చేపలు వేట సాగిస్తున్నారు. రుద్రూర్, అంబం (ఆర్) కొందాపూర్, చిక్కడపల్లి, రాణంపల్లి అలుగు పారుతున్నాయి. గత రెండు రోజులుగా వర్షం లేనందున నీటి ప్రవహంలో చెరువులో నుండి వస్తున్న చేపలకు వల వేసి కొందరు పడుతుండగా, నీట మునిగిన పొలం గట్లపై నిలబడి చేపల వేట సాగిస్తున్నారు.